సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం 11 కేవీ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె. నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద గల మార్కెట్ ఏరియా,పాత్రుడుకాలనీ, శ్రీహరిపురం మెయిన్ రోడ్డు ఏరియా,వీటీ కాలేజీ రోడ్డు, ఓల్డు రామాలయం వీధి తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బుచ్చిరాజుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో..

విశాఖ విద్య: బుచ్చి రాజుపాలెం సబ్ స్టేషన్ పరిధి ఎన్ఏడీ ఫీడర్, అదే విధంగా కొత్తపాలెం సబ్‌స్టేషన్ చంద్రనగర్ ఫీడర్‌లో మెయింటెన్స్ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుసర్ల కాలనీ, సీతారామరాజు నగర్, ఎన్ఏడీ ఎస్సీ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, గాంధీనగర్, రెడ్డి వీధి,గవరవీధి, జయప్రకాష్ నగర్, చంద్రనగర్ ,తుంపాల వీధి,ఎల్లపువాని పాలెం, సంతోషి నగర్, కార్వేల్‌నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు దీన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కంభంపాటికి ఘన స్వాగతం



విమానాశ్రయంలో హరిబాబుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు గురువారం విశాఖ చేరుకున్నారు. ఆయనకు విశాఖ విమానాశ్రయంలో బీజేపీ నాయకులు బాల రాజేశ్వరరావు, జీసీ నాయుడు, మోహనరావు, కేశవ కాంత్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి నగరంలోకి రోడ్డు మార్గాన వెళ్లారు.

రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి

గోపాలపట్నం: రాష్ట్రంలో ఎగ్జిబిటర్లు, ప్రొడ్యూసర్లతో పాటు సినీపరిశ్రమ బాగు పడేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ప్రభుత్వం విప్ గణబాబు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్‌షోలను రద్దు చేస్తుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. గోపాలపట్నంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. సినిమా హాల్లు మూసి వేసి కల్యాణ మండపాలుగా మార్చుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వీటిని కాపాడుకునే విధంగా రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ఊతమిచ్చేలా తమ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందన్నారు. విద్యుత్ చార్జీల భారం గత వైఎస్సార్ ప్రభుత్వానిదే అన్నారు. అనాలోచిత నిర్ణయాల వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు.

విశేషంగా నృసింహ హోమం

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణ ధారణ చేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమ్మో.. మారుతీ సర్కిల్!

ఆ మార్గంలో ప్రయాణం అంటే వాహనదారులు హడలి పోతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో సమయానికి కార్యాలయాలు, ఇళ్లకు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో నరకం చూస్తున్నారు. డాక్‌యార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మరమ్మతులు, విస్తరణ కోసం ఆ రహదారిలో రాకపోకలు నిలిపి వేశారు. అప్పటి నుంచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



మంగళవారం రాత్రి మారుతీ సర్కిల్ దగ్గర నిలిచిన ట్రాఫిక్

- నిత్యం ట్రాఫిక్ సమస్య
- కిలోమీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలు
- సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక అవస్థలు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న వాహనదారులు

చాలా ఇబ్బంది పడ్డాను



విధులు ముగించుకుని డాక్‌యార్డ్ నుంచి మారుతీ సర్కిల్ వైపు వెళ్లే మార్గంలో మంగళవారం రాత్రి,బుధవారం ఉదయం తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంది. దీంతో సుమారు 45 నిమిషాల పాటు ఆ సేవా మార్గంలో నిలిచిపోవాల్సిన పరిస్థితి కలిగింది.ప్రతి రోజూ ఇక్కడ ఇదే సమస్య. దీనిపై అధికారులు దృష్టి పెట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి.

-మురళీకృష్ణ , షిప్‌యార్డ్ ఉద్యోగి

మల్కాపురం: డాక్‌యార్డ్ నుంచి మారుతీ సర్కిల్ వైపు వెళ్లే మార్గంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇక్కడ మారుతీ సర్కిల్ నుంచి ములగాడ విలేజ్‌కు వెళ్లే మార్గం మధ్యలో శ్రావణి షిప్పింగ్ అనే సంస్థ ఉంది. ఆ సంస్థ నుంచి వివిధ ప్రాంతాలకు కంటైనర్లు,టిప్పర్లతో లోడ్‌లు తరలించడం,అన్‌లోడ్ చేయడానికి పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్యలో ఇవి డాక్‌యార్డ్ నుంచి మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గానికి ఓ వైపు (క్యూ మాదిరిగా)నిలుపుతారు. అయితే ఆ సమయంలో




మారుతీ సర్కిల్ నుంచి డాక్‌యార్డ్ వైపు వచ్చే మార్గంలో బుధవారం ఉదయం ట్రాఫిక్

డాక్‌యార్డ్,షిప్‌యార్డ్,హెచ్‌పీసీఎల్ ఇతర పరిశ్రమల నుంచి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే వారి పాటు వివిధ కళాశాల నుంచి ఇంటికి వెళ్లే వారు,ఆర్టీసీ బస్సులు,ఇతర ట్రాన్స్‌పోర్టు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కూడలి సమీపంలోకి వచ్చే సరికి అప్పటికే నిలిపి ఉన్న మార్గంలో వాహనాల వల్ల మార్గం ఇరుగ్గా మారుతుంది. అదే విధంగా మారుతీ సర్కిల్ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వాహనాలను వదిలేటప్పుడు ఆ సమయంలో ఇతర వాహనాల రాకపోకలు నిలిపేస్తారు. దీంతో అక్కడ తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది. దీంతో వాహనాలు మూడు వైపులా భారీగా నిలిచి పోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ఈ సమస్యపై అధికారులు దృష్టి పెట్టి రాత్రి సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అరగంట ఆగిపోయాను

మారుతీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్య వల్ల సుమారు 30 నిమిషాల పాటు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మారుతీ సర్కిల్ నుంచి ములగాడ విలేజీకు వెళ్దామని మంగళవారం సాయంత్రం బయలు దేరాను.అక్కడ నెలకున్న ట్రాఫిక్ సమస్య తీవ్ర అసౌకర్యానికి గురి చేసింది.నిత్యం ఇక్కడ ఇదే సమస్య అని పలువురు వాహనదారులు చెప్పారు.



- నర్సింగరావు, వాహనదారు

విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట నేడు

మల్కాపురం: పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా పశ్చిమనియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో 61వ వార్డు మల్కాపురం బస్టాప్ నుంచి మల్కాపురం సబ్‌స్టేషన్ వరకు శుక్రవారం ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ చేపట్టనున్నారు. కార్యక్రమానికి కార్పొరేటర్లతో పాటు వార్డు పార్టీ అధ్యక్షులు,అనుబంధ సంస్థలు ప్రతినిధులు హాజరు కావాలని విజయప్రసాద్ కోరారు.

పేదలకు అండగా సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యాంజనేయ

మల్కాపురం: సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కె.సత్యాంజనేయ పిలుపునిచ్చారు. 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలి వద్ద గురువారం ఆయన పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కుల కోసం దేశ నలుమూలల అనేక పోరాటాలు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. ఎప్పుడూ పేదలు, కార్మిక వర్గం పక్షాన నిలబడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు,శ్రీరామమూర్తి,అప్పారావు,గురువులు తదితరులు పాల్గొన్నారు.

రంగా సేవలు మరువలేనివి



59వ వార్డు వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రేవళ్ల సత్యనారాయణ



శ్రీహరిపురం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నానాజీ

మల్కాపురం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత వంగవీటి మోహనరంగా అని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ అన్నారు. రంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానికంగా గల వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయడమే రంగా తత్వం అన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరాజు ,భూపతి అప్పలరాజు,కుంటారావు,తిరుపతిరెడ్డి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- 58వ వార్డు శ్రీహరిపురం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకుడు పెదిరెడ్ల నానాజీ తదితరులు మోహన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



పూజలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి గురువారం కన్యకాపరమేశ్వరిని కనకమహాలక్ష్మి అలంకరణలో తీర్చిదిద్దారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రాత:కాల ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో కనకమహాలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. దేవాలయ ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే 250 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి ప్రీతికరమైన నాణాలతో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి డీవీ బాలాజీకుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు బాదం నాగవెంకట కమలశ్రీ, కట్టమూరి ప్రసన్న, కడిమిశెట్టి దంతేశ్వరి, గ్రంధి దేవి, పాలూరి స్వర్ణలత, కొల్లూరు విశాల, గ్రంధి ఉష, కందుల గీతా ఆదిలక్ష్మి, పసుమర్తి హైమావతి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహామహులను అందించిన చరిత్ర ఏవీఎన్ కళాశాలది



కళాశాల స్టూడెంట్ కమిటీకి రూ.25 వేల చెక్కు అందజేస్తున్న పైడి రజని

డాబాగార్డెన్స్: దేశంలో పేరొందిన ప్రతిష్టాత్మక విద్యా సంస్థగా మిసెస్ ఏవీఎన్ కళాశాల నిలుస్తుందని ఆ కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు పైడి రజని పేర్కొన్నారు. కళాశాల 164వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు వంటి స్వాతంత్ర్య సమర యోధుడిని, వివిధ రంగాల్లో ప్రపంచంలో పేరొందిన గొప్ప వ్యక్తుల్ని అందించిన చరిత్ర ఏవీఎన్ కళాశాలకు ఉందని రజని తెలిపారు. గత ఐదేళ్లుగా శక్తి సంస్థ తరఫున ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థులకు భోజనాల కోసం రూ.25 వేల చెక్కును స్టూడెంట్ ఆర్గనైజేషన్ కమిటీకి ఈ సందర్భంగా పైడి రజని అందజేశారు. పైడి రజనిని కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అభినందించారు.

పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

సీపీఐ సీనియర్ నేత చలసాని రాఘవేంద్రరావు



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చలసాని రాఘవేంద్రరావు తదితరులు

అల్లిపురం: వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఐ సీనియర్ నేత, రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్ల ప్రస్థానంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట వారసత్వంతో పాటు సామాజిక ప్రగతి కోసం నిరంతరం పోరాటాల్లో ఉన్న కమ్యూనిస్టు శక్తుల చరిత్రను మననం చేసుకుంటూ భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సమాయత్తం కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్‌జే అత్యుతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, బీసీహెచ్ మసేను, క్షేత్రపాల్, సమితి సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

వైభవుడికి విశేష పూజలు



వైభవుడి ఆలయంలో పాశుర విన్నపం చేస్తున్న ఈవో ప్రసాద్ దంపతులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవిని వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ప్రదక్షిణ చేశారు. తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరఫున శ్రీరంగనాథుడికి 11వ పాశుర విన్నపం చదివి వినిపించారు. భక్తులు పాశుర పారాయణం చేశారు. మంగళాశాసనం, తీర్థ ప్రసాదగోష్టి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శేషాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా 11వ పాశురం ప్రాధాన్యాన్ని వివరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వైభవుడికి నక్షత్ర హారతి సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మురళీనగర్ రామాలయంలో సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతోపాటు పాశుర విన్నపం సమర్పించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజభాష అమల్లో టోలిక్ సేవలు ప్రశంసనీయం



సమావేశంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే, హెచ్‌పీసీఎల్ ఈడీ రామకృష్ణన్

ఉక్కునగరం: రాజభాష అమలుకు పట్టణ అధికార భాషా అమలు కమిటీ (టోలిక్) చేస్తున్న కృషి ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె. సక్సేనా అన్నారు. ఉక్కు హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో గురువారం టోలిక్ 16వ సమావేశం జరిగింది. సక్సేనా వర్చువల్ పద్ధతిలో టోలిక్‌కు చెందిన 'ఈ-ప్రస్తుతికిరణ్' ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 2023-24కు విశాఖ టోలిక్ ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే, హెచ్‌సీసీఎల్ ఈడీ ఆర్. రామకృష్ణన్ మాట్లాడుతూ టోలిక్ కార్యక్రమాలు హిందీ మరింత అమలుకు దోహదపడతాయన్నారు. 2024-25 మొదటి అర్ధ సంవత్సరంలో అధికార భాష అమలు ప్రగతిని సమీక్షించారు. అధికార భాష అమలు డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రీటా త్రివేది, స్టీల్‌ప్లాంట్ రాజభాష అధికారులు లలన్‌కుమార్, టి. హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సీఐఎస్ఎఫ్ మాక్ డ్రిల్



బిల్డింగ్‌లోకి ప్రవేశిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం బీసీఏ స్వై యార్డ్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల కుప్పకూలిన నిర్మాణం, రెస్క్యూ అనే అంశంపై నిర్వహించిన మాక్ డ్రిల్ ఉత్కంఠగా జరిగింది. భూకంపం సంభవించడంతో ప్లాంట్‌లో భవనం కుప్ప కూలి బిల్డింగ్‌లో చిక్కుకోవడంతో కొంత మంది గాయపడినట్టు సమాచారం అందింది. వెంటనే జిల్లా అధికారులు, స్థానిక పోలీసులు, స్టీల్‌ప్లాంట్ అధికారులు, సీఐఎస్ఎఫ్ ఫైర్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, వైద్య బృందం, ఎన్‌డీఆర్‌ఎఫ్ యూనిట్ కమాండర్, భద్రతా విభాగానికి చెందిన అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బిల్డింగ్‌లో గాయపడిన వ్యక్తులను సురక్షితంగా తరలించారు. విశాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి. సురేష్ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించి అక్కడ ఏజెన్సీల సంసిద్ధతను వీక్షించారు. మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసినట్టు సీఐఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

యూజీడీ పనుల పరిశీలన



మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ఎన్టీఆర్‌కాలనీలో నాలుగు రోజులుగా జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు గురువారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు ఎన్టీఆర్‌కాలనీలోని అన్ని బ్లాక్‌ల్లోని సెప్టిక్‌ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో సెప్టిక్‌ట్యాంక్ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ట్యాంకులకు అవుట్‌లెట్ కనెక్షన్లు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ సుమన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు



కుటుంబ సభ్యులకు అప్పగించిన ఫౌండేషన్ సభ్యులు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించిన వృద్ధుడిని గురువారం అతని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. షెల్టర్ మేనేజర్ మమత తెలిపిన వివరాల ప్రకారం .. మానసిక పరిస్థితి బాగోలేక ఎన్ఏడీ బ్రిడ్జి కింద ఉన్న వృద్ధుడిని జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత షెల్టర్‌కి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అంతే కాకుండా చికిత్స నిమిత్తం మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చేర్పించారు. అతడే కోలుకున్న తర్వాత రాంసదన్ వారి కుటుంబ సభ్యులు వివరాలు తెలిపాడు. శ్రద్ధా ఫౌండేషన్ సహాయంతో ఉత్తరప్రదేశ్‌లోని దయాల్ పూర్ అనే గ్రామంలో ఉంటున్న వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏడాది కిందట తప్పిపోయిన రాంసదన్ కనిపించడంతో కుటుంబ సభ్యులు షెల్టర్ మేనేజర్ మమతతో పాటు శ్రద్ధా ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

సామాజిక సర్వే పూర్తి చేయాలి



సచివాలయ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

మహారాణిపేట: కులగణనపై అన్ని సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే పూర్తి చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లునాయుడు కోరారు. గురువారం సూర్యాబాగ్ జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. షెడ్యూల్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి అంశాలపై సమీక్ష చేసేందుకు, పథకాలు అమలు చేసేందుకు, మెరుగైన పాలసీ రూపకల్పన కోసం నిర్వహించిన కులగణనపై గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సామాజిక సర్వే (సోషల్ ఆడిట్)ను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో సోషల్ ఆడిట్ జరుగుతుందని, ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ కూడా ఉంటుందని అన్నారు. 26 నుంచి 31వ తేదీ వరకు ప్రజల నుంచి లేదా థర్డ్ పార్టీ నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, అభ్యంతరాల వివరాలను అధికారులు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. తదనంతరం డేటా ధ్రువీకరించి జనవరి 10న తుది కులగణన సర్వే డేటా ప్రచురించాలని తెలిపారు. సంబంధిత సచివాలయ సిబ్బంది ఈ ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించి సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. సమావేశంలో మహారాణిపేట ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట: మీ పరిధిలో ఎటువంటి వ్యాధులు సంభవించినా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. చినవాల్తేరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. పలు సర్వేల కోసం సిబ్బందితో చర్చించారు. నేషనల్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) 3.0 సర్వే, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అభ ఐడీ మ్యాపింగ్ శత శాతం సాధించాలని సూచించారు. యూపీహెచ్‌సీ పరిధిలో ఏ విధమైన వ్యాధులు సంభవించినా తక్షణమే సంబంధిత వైద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి తెలియజేయాలన్నారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, నేషనల్ హెల్త్ మిషన్ డీపీవో శశిభూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com